# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాజధానిలో అసైన్డ్ భూముల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

2. **జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై జరిగే చర్చల్లో పాల్గొనేందుకు సిద్ధం కావాలని ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కల్యాణ్ జనసేన పార్టీ ఎంపీలకు సూచించారు.**

3. **రాజధాని అమరావతి విస్తరణ కోసం మరో విడత భూ సేకరణకు మంత్రి వర్గం ఆమోద ముద్ర వేసినట్లు మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**

4. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**

5. **కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు.**

==========================

రాజధానిలో అసైన్డ్ భూముల సమస్యలను త్వరలో పరిష్కరించనున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ – సిఆర్‌డీఏ కార్యాలయంలో రాజధాని రైతుల సమస్యల పరిష్కారంపై త్రిసభ్య కమిటీ ఈరోజు సమావేశమైంది. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో ఉన్న పింఛన్లు, హెల్త్ కార్డుల సమస్యలు పరిష్కరించ నున్నట్లు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెబుతూ..

వాయిస్…35 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయానికి ఈ మధ్యాహ్నం వెళ్లనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నారు. అనంతరం పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై రాష్ట్ర కమిటీ, పార్లమెంట్ అధ్యక్షుల ఎంపికలపై చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

---------------------------

జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై జరిగే చర్చల్లో పాల్గొనేందుకు సిద్ధం కావాలని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు కే. పవన్ కల్యాణ్ ఆ పార్టీ ఎంపీలకు సూచించారు. వచ్చేనెల 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో అనుసరించాల్సిన విధానాలపై జనసేన పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లతో గత రాత్రి పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులు వేగవంతమయ్యేలా సంబంధిత శాఖల మంత్రులతో సమావేశమై వివరాలు అందించాలని సూచించారు. పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ కేంద్ర పథకాల ద్వారా నిధుల మంజూరు గురించి కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని ఉపముఖ్యమంత్రి వారికి దిశానిర్దేశం చేశారు.

---------------------------

2027లో జరిగే గోదావరి పుష్కరాలకు 5 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగినట్లు ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పుష్కరాల కోసం రూపొందించాల్సిన ప్రణాళికలపై దేవాదాయశాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. గోదావరి పుష్కరాలు-2027 పేరుతో అధికారిక గుర్తు రూపొందించాలని సూచించారు. ఘాట్ల వద్ద మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు చేయడం, దుస్తులు మార్చుకునేందుకు గదులు నిర్మించడం, తాగునీటి సదుపాయం కల్పించడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. ఇందుకు ఆయా శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

---------------------------

రాజధాని అమరావతి విస్తరణ కోసం మరో విడత భూ సేకరణకు మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో మంత్రి వర్గ సమావేశం అనంతరం ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. రెండో విడతలో మొత్తం ఏడు గ్రామాల్లో భూ సేకరణ కోసం మంత్రి వర్గం అంగీకరించినట్లు చెప్పారు. రాజధానిలో రాబోయే 30 సంవత్సరాలకు ప్రజల జీవన స్థితిని దృష్టిలో ఉంచుకుని కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి నారాయణ వివరిస్తూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో ఈరోజు ఉదయం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కోటేకల్ వద్ద రెండు కార్లు ఎదురెదురుగా వచ్చి ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని ఆదోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ ప్రమాదంపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.

---------------------------

బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని సముద్ర తీర ప్రాంతాన్ని పర్యాటక రంగంగా అభివృద్ధి చేయనున్నట్లు చీరాల శాసనసభ్యులు ఎమ్ఎమ్ కొండయ్య తెలిపారు. చీరాల – వాడరేవు సముద్ర తీరంలో దెబ్బతిన్న కల్వర్టులు, రహదారులకు తాత్కాలిక మరమ్మతుల పనులకు ఆయన ఈరోజు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా

శాసనసభ్యులు కొండయ్య మాట్లాడుతూ.. 40 లక్షల రూపాయలతో తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నట్లు వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని తీరా ప్రాంతాలను అనుసంధానం చేస్తూ నాలుగు లైన్‌ల రహదారుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొంటూ...

..వాయిస్.. 20 సెకన్లు

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

-----------------------------

దిత్వా తుఫాన్ నేపథ్యంలో కలెక్టర్లు, ఎస్పీలు, విద్యుత్ శాఖ అధికారులతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈరోజు మాట్లాడారు. 'దిత్వా' తుఫాన్ ప్రభావం ఉండే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ.. క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులను మంత్రి ఆదేశించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని దిశానిర్దేశం చేశారు. ముందు జాగ్రత్త చర్యలతో ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని మంత్రి సూచించారు.

-----------------------------

అనంతపురం జిల్లా వ్యాప్తంగా డిసెంబర్ 5వ తేదీన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 3.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. అనంతపురంలో ఆయన పాత్రికేయుల సమావేశం ఈరోజు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పిటీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య పరస్పర అవగాహన పెంపొందించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

-----------------------------

నైరుతి బంగాళాఖాతంలోని శ్రీలంక తీరంలో ఏర్పడిన 'దిత్వా' తుఫాన్.. ఉత్తర-వాయువ్య దిశగా వేగంగా కదులుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం త్రికోమలికి వాయువ్యంగా 80 కిలోమీటర్లు, పుదుచ్చేరికి దక్షిణ ఆగ్నేయంగా 330 కిలోమీటర్లు , చెన్నైకి దక్షిణంగా 430 కిలో మీటర్లు దూరంలో కేంద్రీకృతమై ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలిపారు.

=====================